మాటలు - చేతలు

హాలు ప్రేక్షకులతో క్రిక్కిరిసి వుంది. నాటకం ప్రారంభించే వేళయింది. నిర్వాహకుల తరఫున వారి కార్యదర్శి వేదిక మీదికి వచ్చాడు.

"మహాజనులారా! మరి కొద్ది నిముషాల్లో, నాటకం ప్రారంభించబడుతుంది. ఈ నాటకాన్ని విజయవంతంగా సాగించడానికి తోడ్పడిన మీ అందరికీ, మా సమితి తరఫున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

"ఈ నాటి నాటకానికి వసూలైన మొత్తం దేశరక్షణ నిధికి పంపుతున్నామని తెలియజెయ్యడానికి, ఎంతో ఆనందిస్తున్నాం, అంతేకాదు - ప్రస్తుతం మేం ప్రదర్శించబోతున్న నాటకం కూడా, దేశాభ్యుదయానికి సంబంధించిందే కావడం గమనించ తగ్గ విషయం. ఈ నాటకాన్ని నిశ్శబ్దంగా చూచి ఆనందించి, అందులోని నీతిని ఆదర్శంగా తీసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పుడు ప్రముఖ న్యాయవాది, శ్రీ మహేశ్వరరావుగారు రెండు ముక్కలు మాట్లాడుతారు. సావధానంగా వింటారని నా నమ్మకం..." అంటూ వేదికపైకి శ్రీ మహేశ్వరరావుగారిని ఆహ్వానించాడు కార్యదర్శి కేశవరావు.

మహేశ్వరరావుగారు, నలభై అయిదు సంవత్సరాలు పైబడిన వ్యక్తి. గంభీరంగా అగుపిస్తారు. దేశభక్తులు. దేశం కోసం యేత్యాగం చెయ్యడానికైనా సంసిద్ధులాయన. అందుకే యిటువంటి సందర్భాల్లో ఆయన యెక్కువ ఆసక్తి చూపుతూ వుంటారు.

మహేశ్వరరావుగారు, మైకుముందు నుంచుని గొంతు సవరించుకొని మాట్లాడారు. "సోదర, సోదరీ మణులారా, ప్రస్తుతం మన మొక పరీక్షలో నిలబడ్డాం: చైనావారు మన దేశాన్ని అక్రమంగా, అకారణంగా దోచుకోవాలన్న తలంపుతో దురాక్రమణ జరిపే ప్రయత్నంతో మనల్ని మేల్కొలిపారు. వారు చేసిన యీ అన్యాయానికి, ప్రపంచమంతా వారిని అసహ్యించుకుంటున్నా, వాళ్ళు మాత్రం, తమని తాము సమర్థించుకుంటుకు యేవో కల్లబొల్లి కల్పనలు ప్రచారం చేస్తున్నారు. ఇక మీదట వారు యెటువంటి అన్యాయానికి తలపెట్టినా, మనమంతా యేకమై, ధైర్యంగా యెదిరించి, వారికి పాఠం చెప్పడమే మన కర్తవ్యం. అదే మనల్ని యెదుర్కొన్న పరీక్ష కూడాను. ఈ పరీక్షలో మనదే పైచేయి. అందుకు సందేహంలేదు అయితే, మనలో ఐక్యత కావాలి. అంతేకాదు. శక్త్యానుసారంగా దేశరక్షణకు చేయూతనివ్వాలి. ఈనాడు మనం యిప్పుడు ప్రదర్శించబోయే నాటకాన్ని చూడ్డానికి రావడం యెంతో శ్రేయోదాయకం. ఐక్యతవల్ల కలిగే లాభాలను వ్యక్తంచేసే నాటకం యిది! ఈ నాటకాన్ని మీరంతా చూసి, ఆనందిస్తారనే నమ్మకం నాకుంది. అందులోని నీతిని సూక్ష్మంగా గ్రహించి,

ఆచరణలో పెడతారనే నమ్మకంకూడా వుంది. జైహింద్:” అంటూ ముగించా రాయన.

హాలంతా, కరతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది. క్షణం పోయాక నిశ్శబ్దం ఆవరించింది. ప్రార్థన గీతం వినిపించింది.. తక్షణమే తెర లేచింది.

నాటకం ప్రారంభమయ్యింది! నాటకంలో నాయకుడి పాత్ర పరంధామయ్య కొడుకు ప్రభాకరం నిర్వహించాడు. కథానాయకి పాత్ర మహేశ్వరరావుగారి అమ్మాయి సుజాత నిర్వహించింది. సుజాతను రంగస్థలంమీద చూస్తూనే, మహేశ్వరరావుగారు మండిపోయారు. అయితే, ఐక్యత అవసరమని, అతనే ఉపన్యాసం యిచ్చి వుండటం వల్ల చప్పున ఆవేశం తెచ్చుకొని అసభ్యంగా ప్రవర్తించలేక పోయాడు.

నాటకం జయప్రదంగా కొనసాగింది. నాటకంలో వుత్తమ నటనకు రెండు బహుమతు లేర్పాటు చెయ్యబడ్డాయనీ, ఆ బహుమతులను మహేశ్వరరావుగారే ప్రధానం చెయ్యాలని కార్య నిర్వాహకులు ప్రకటించారు. మహేశ్వర రావుగారికి ఈ ప్రకటన మనస్కరించలేదు. అయినా, ఆ క్షణంలో నిరాకరించలేక పోయారు. ఉత్తమ నటనకు నాయకీ నాయకులకు బహుమతులు లభించాయి.

కూతురికి బహుమతి అందజేస్తున్న మహేశ్వరరావు గారి మొహం, అప్రయత్నంగా అరుణకాంతిని పుంజుకుంది. కార్యనిర్వాహకులు అతని ముఖ కవళికలు గమనించి,

కాస్తంత కలవరపడ్డారు కూడాను. అవుతే ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో, మహేశ్వరరావుగారి కోపం అణగారిపోయింది.

ఆ రోజు కార్యక్రమం మెలాగో సవ్యంగా ముగిసింది. మహేశ్వరరావుగారు అక్షణ్ణించి నిష్క్రమించారు.

* * *

సుజాత యిల్లు చేరుకునేసరికి, కాస్త ఆలస్యమయ్యింది. ఇల్లు చేరువ అవుతున్న కొద్దీ, భయపడిం దామె. ఆమెకి అప్పు డనిపించింధి, తను తప్పు చేశానని: నాటకంలో వేషం వేస్తున్నట్టు తండ్రితో ముందుగానే చెప్పి వుండవల్సింది.. అను కుంటూ మెల్లగా, అడుగులో అడుగు వేసుకుని లోపలికి నడిచింది.

మహేశ్వరరావుగారు హాల్లో కూర్చొని వున్నారు సోఫాలో. ఆయ నింకా దుస్తులుకూడా మార్చలేదు. తండ్రిని చూస్తూనే స్తంభించిపోయింది సుజాత. లోపలికి వెళ్ళిపో బోయింది మౌనంగా. "సుజాతా" వురిమినట్లుగా కేక వేశారు మహేశ్వరరావుగారు. అతని కంఠం కోపంతో కంపించింది.

సుజాత టప్పున ఆగిపోయింది. మెల్లగా తండ్రి సమీపానికి వచ్చింది. ఆయన మొహంలోకి చూాళ్ళేక పోయింది.

"నా యింట్లో మళ్ళీ ఎందుకు అడుగు పెట్టావే? ఆ పఖాకరంతో పాటే వెళ్ళిపోలేక పోయావూ? వాళ్ళకీ,

మనకీ విరోధం వుందని తెలిసికూడా, వాడితో నాటకం వెయ్యడానికి యెలా అంగీకరించావు? ఇంత ధైర్యం నీలో యెలావచ్చింది? నా గౌరవం మంటగలిపావు కదా?" రుసరుస లాడుతూ అన్నాడు. ఆ కోపంలో అతను యిటూ. అటూ, పచారుచేయడం. ప్రారంభించాడు.

సుజాత క్షణంమాట్లాడ లేకపోయింది. అలా మౌనంగా వుండటం, మరీ మంచిది కాదనిపించింది.

"ఏ విధంగా మీ గౌరవం మంట గలిసిందంటారు నాన్నా?" అంది.

కూతురు యెదురుప్రశ్న వెయ్యటం. ప్రథమ పర్యాయంగావింటున్నాడాయన. యిందుకు విస్తుపోయాడు కూడాను

"ఇంక ఆ మాట మెల్లిగా అంటున్నావేమిటి సుజాతా: వాళ్ళకీ, మనకీవున్న బద్ధవైరం మాట మరిచావా ? ఇంత కంటె తలవంపు కలిగించే విషయం మరోటి యేం కావాలి ? నా కూతురు నా విరోధి కొడుకుతో నాటకం వేసిందంటే, నాకు మిగిలిన వ్యక్తిత్వం యేమిటీ? ఛీ! ఛీ ! ఇటువంటి అవమానం, నా జీవితంలో యెప్పుడూ తారసపడలేదు. ఈ రోజు నుంచీ నీ చదువుకి స్వస్తిచెప్పి, లక్షణంగా యింట్లోకూచో!" వుక్రోషంతో అన్నాడు. "నాన్నా!" స్తంభించి పోయింది సుజాత. చదువుకి స్వస్తిచెప్పమనడం ఆమెను మరింత బాధించింది. బి. ఏ పట్టా పుచ్చుకుందుకు మరొక్క సంవత్సర ముంది. ఈరోజు సంఘటనికి తన భవిష్యత్తే బలి అవుతుందా?

ఇన్నాళ్ళ శ్రమ వృథా అవుతుందా?.... యింక ఆమె ఆలో చించలేక పోయింది,

"ఏమిటి నాన్నా, మీ రంటున్నది ? నా చదువుకే స్వస్తి చెప్పమంటున్నారా ? ఇన్నాళ్ళ నాశ్రమ వృథా కావ ల్సిందేనా ? ఇంతకీ నేను చేసిన అంత ఘోరమైన తప్పేమిటి?"

"తెలీనట్టు అడుగుతా వేం? మనకి విరోధి అయిన పరంధామయ్య కొడుకుతో పరిచయం యేర్పర్చు కోవడమే నీ తప్పు. అది నాకు తలవంపు తెచ్చేది కాబట్టి క్షమించరాని తప్పు" అన్నాడు కోపంగా.

"ఏమిటంటే సుజాత చేసిన తప్పు" అనుకుంటూ లోప లికి వచ్చాడు ప్రభాకరం.

మహేశ్వరరావుగారు, ప్రభాకరంని చూస్తూనే కాస్తంత కలవరపడ్డారు.

"నువ్వా!" అన్నారాయన ఆశ్చర్యంతో. కూతురూ, ప్రభాకరం, కలిసివచ్చారన్నది యిప్పుడు గ్రాహ్యమయింది. "ఔనండీ! మీరు అంటున్న ప్రతిపదం విన్నానండీ ! కాని, నేను బాధపడేది ఒక్కటే; మీ వంటి అభ్యుదయ భావాలు గల వ్యక్తి, ఇలా ప్రవర్తిస్తారని అనుకోలేదు. మానాన్నా, మీరూ, యే విషయం గురించి విరోధపడ్డారో, యెవరి క్కావాలి? మీ తొందర పాటుకి, అమాయకులమైన మేం బాధపడాలా? ఇదెక్కడి న్యాయమండీ! అదీగాక, ఐకమత్యత అవసరమని యిప్పుడే కొద్ది గంటలక్రితమే, వేదికపై నుంచుని వుపన్యాసమిచ్చారే; మనలోని విభేదాలను పారద్రోలాలని

చెప్పారే మరి, అవన్నీ యిప్పు డేమయ్యాయండీ? మీ మాట లకీ, చేతలకీ, సమన్వయం వుండదా ? మీ వంటి ప్రసిద్ధవ్యక్తే యిలా ప్రవర్తిస్తే మిగతావారి విషయం. యింకేం చెప్తాం ? దేశంలోని ప్రతివ్యక్తీ, యేదో ఒక విభేదాన్ని మనసులో పెట్టుకుని ప్రవర్తిస్తే యింకా దేశంలో ఐక్యత కావలంటే, యెలా సాధ్యపడుతుంది చెప్పండి ? ఇప్పుడు మీ పట్టుదలనూ, మీ రిప్పుడు సుజాతతో అన్న మాటల్నీ, నేను బైటపెడితే, మీకు యేం విలువ వుంటుంది చెప్పండి ? మిమ్మల్ని గౌరవంగా చూసిన ప్రజానీకం, మీగురించి యేమనుకుంటారు? ఉపన్యా సాలు యివ్వడం కాదుసార్ కావల్సింది, చెప్పినవి కార్య రూపంలో పెట్టడం ! అప్పుడే వ్యక్తి విలువ పెరుగుతుంది," నిశ్చలంగా చెప్పాడు ప్రభాకరం.

మహేశ్వర్రావుగారికి కోపం యినుమడించింది ఎర్రగా చూశారు ప్రభాకరం కేసి.

"అంటే, నాకు విలువలేదనే నీ వుద్దేశమా ? ఏమిటి నీ పొగరుబోతుతనం. నీకేం మతిపోయిందా? నా యింట్లోనుం చుని, నన్నే తూలనాడుతున్నావా ? తక్షణం ఇంటినుండి బైటికినడు....వూఁ...." గర్జించారు మహేశ్వర్రావుగారు.

"నాన్నా ?" అంటూ వారించబోయింది సుజాతా.

"నువ్వు నోర్మూయ్. నీ వల్లనే విషయం యింత మేరకు వచ్చింది." అన్నారు మహేశ్వర్రావుగారు.

ప్రభాకరం చిన్నగా నవ్వేడు. "మీరు అనవసరంగా ఆవేశపడుతున్నారండీ! మీరు చెప్పనవసరం లేదు, నేనే

వెళ్ళిపోతాను కాని, ఒక విషయం గుర్తుంచుకోండి. మన విభేదాలు ఇలానే కలకాలం వుండాలని మీరు కోరితే, మీ పరపతి దెబ్బతింటుందని మాత్రం గ్రహించండి. రేపే ప్రతికలో మీ గురించిన వ్యాసం ప్రకటింపజేస్తాను. మీరు చెపున్న శ్రీరంగ నీతులకీ, బోధనలకీ, ఆచరిస్తున్న చేష్టలకీ, యెక్కడైనా సామ్యం వుందో లేదో, ప్రజలే గుర్తిస్తారు. వస్తా..." అంటూ వెళ్ళబోయాడు ప్రభాకరం.

మహేశ్వర్రావుగారిలో, ప్రభాకరం మాటలు, పాదరసంలా ప్రవహించాయి. ప్రజల్లో తన గౌరవమే ప్రధానం మహేశ్వర్రావుగారికి ప్రభాకరం అన్నంతపనీ చేస్తాడన్న నమ్మకం యేర్పడిందతనికి. ఆయనలో కలవరం వుత్పన్నమయింది. నిజమే. తనలాంటి వ్యక్తి, పట్టుదల పట్టుక్కూర్చోవడమేమిటి ?

"ఆగవోయ్!" వెళ్ళిపోతున్న ప్రభాకరంని పిల్చారు మహేశ్వర్రావుగారు. ప్రభాకరం దగ్గరగా వచ్చాడు.

"నిజమేనోయ్ ప్రభాకరం ! నువ్వన్నది నిజం నేను చెప్తున్నదానికీ, చేస్తున్నదానికీ యెక్కడా పొత్తులేదు అది నా బలహీనతే! నేనే ఓడిపోయాను. దేశంలో ప్రతిపౌరుడు పట్టుదలలూ, పగలూ త్యజించిననాడే, దేశం ఒకటిగా నిలబడుతుంది. అప్పుడుమనం ఎటువంటి క్లిష్టపరిస్థితినైనా యెదుర్కోవచ్చు. మీ నాన్నతో నాకు విరోధం అవాంఛనీయం. నేనే ముందుఅదర్శించాలి రేపే మీ యింటికివచ్చి మీ నాన్నని

కలుసుకుంటాను. చాలా వేళయింది-వెళ్ళిక," అంటూ ప్రభాకరం భుజం తట్టాడు మహేశ్వర్రావుగారు.

ప్రభాకరం, మహేశ్వర్రావుగారిలో హఠాత్తుగా కలిగిన పరిణామానికి ఆశ్చర్యపోయాడు. సుజాతకేసి చూస్తూ, తృప్తిగా నవ్వుకున్నాడు.

"వస్తానండీ!"

నిష్క్రమించాడు ప్రభాకరం.

సుజాత, మొహం దించుకుని, ఇంకా అక్కడే నుంచుంది. ఆమె చేతిలోవున్న రజితపాత్ర మిలమిల మెరుస్తోంది. ఆమెలో చెలరేగిన తుఫాను తగ్గింది.

"వెళ్ళమ్మ, నిద్రపో. నా తొందరపాటుకి నేనే సిగ్గుపడుతున్నాను." కూతురికి దగ్గరగావచ్చి, తలనిమురుతూ అన్నాడు మహేశ్వర్రావుగారు.

సుజాత హృదయం తేలికపడింది. మెల్లగా అక్కణ్ణించి జారుకుంది.

మహేశ్వర్రావుగారు సోఫాలో కూలబడి, తనలో తనే నవ్వుకున్నారు. ఆరోజు తను మరో మంచిపని చేశాడన్న తృప్తియేర్పడిం దతనిలో. ఉత్సాహంగా లేచి పడకగది కేసి నడిచాడు.